క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు

నందలూరు : ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం దాదాపు 46 మంది గర్భిణులను వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తిక్ విశ్వనాథ్‌లు పరీక్షలు చేయగా అందరి గర్భవతులను డాక్టర్ మస్తానమ్మ గైనకాలజిస్టు స్కానింగ్ చేసి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సునీల్, పిహెచ్‌ఎన్ శైలజ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయల్ సేవా సమితి సభ్యులు ఆధ్వర్యంలో గర్భిణులు, ఆశ వర్కర్లకు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం రాయల్ సేవా సమితి అధ్యక్షుడు శ్రీనివాస్, వారి బృందాన్ని వైద్యులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

ఓబులవారిపల్లె : మండలంలోని సీఎం బలిజపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ అధికారులతో కలిసి ప్రారంభించారు. అంగన్‌వాడీ పాఠశాల ద్వారా చిన్న పిల్లలకు మెరుగైన విద్యా బుద్ధులు నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ బాల నరసింహులు, ఎంపీడీఓ మల్‌రెడ్డి, ముక్కా సాయివికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం

పెనగలూరు : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని మండల వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల సమావేశానికి ఆయన రావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎప్పుడూ తమ కుటుంబం అండగా ఉంటుందని తెలిపారు. నమ్ముకున్న వారికి ఎప్పుడూ మంచి జరుగుతుందన్నారు. ఎవరూ అధైర్యపడకుండా పార్టీ కోసం ప్రతి ఒక్కరూ నిలబడాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సౌందర్య, మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీరు నిల్వ చేయడం ఉపయోగకరం

రైల్వేకోడూరు అర్బన్ : పంట పొలాల మధ్యలో నీరు నిల్వ చేయడం ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగకరమని డ్వామా పీడీ వెంకటరత్నం బుధవారం తెలిపారు. మండలంలోని గుండాలపల్లి పంచాయతీలో ఫారం పాండ్ పనులను తనిఖీ చేశారు. అలాగే ఓబనపల్లిలోని కనుపర్తి రత్నమ్మకు చెందిన కోళ్ల ఫారంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులన్నీ ఉపయోగకరంగా జరిగాయన్నారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. అలాగే ఎర్రచందనం పార్కులోని అటవీశాఖ ఆధ్వర్యంలో చెట్ల పెంపకాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ మృత్యుంజయరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

రాజంపేట : నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ లీగల్ సెల్ అడిషనల్ సెక్రటరీగా న్యాయవాది తోట శ్రీనివాస ధీరజ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఇక్కడి విలేకర్లకు ఆయన తెలియజేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ చైర్మన్ డా.సంపత్‌కుమార్ తనను నియమించారని వెల్లడించారు. సమాజంలో రాజకీయ కక్షల వలన మానవ హక్కులు ఉల్లంఘన శాతం రోజురోజుకి పెరుగుతోందన్నారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకొని సమాజాభివృద్ధికి తోడ్పడతానన్నారు.



తోట శ్రీనివాస్ ధీరజ్

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరడమే లక్ష్యం

సంబేపల్లె : ప్రతి విద్యార్థి పట్టుదల క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరడం సాధ్యమని శ్రీ తేజా పాఠశాల వ్యవస్థాపకుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ–2 శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో శ్రీ తేజా పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచే విద్యతో పాటు మంచి అలవాట్లను అలవర్చుకునే విధంగా పిల్లలకు తల్లిదండ్రులు హితబోధ చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడండి

పుల్లంపేట : మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని బుధవారం పుల్లంపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.వరప్రసాద్, కార్యాలయ పరిపాలనాధికారి వై.శ్రీధర్ రెడ్డి, విస్తరణాధికారి కె.ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు సందర్శించారు. అనంతరం వారు వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని పరిశీలించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామ పంచాయతీలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

శ్రీరామ నవమి ఉత్సవాలతో ఐక్యత

రాజంపేట టౌన్ : మండలంలోని కూచివారిపల్లెలో జరుగుతున్న శ్రీరామనవమి వేడుకల్లో బుధవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డిమాసి రమేష్‌నాయుడు ఆహ్వానం మేరకు ఆకేపాటి, పోలా రాములోరి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు గోపాల్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, పోలా శ్రీనివాస్‌రెడ్డి పేరిట అర్చనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏడాది కూచివారిపల్లెలో జరిగే శ్రీరామ నవమి వేడుకలు ఓ ప్రత్యేకతను చాటుకున్నాయన్నారు. రాత్రి వేళల్లో సీతారామలక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయడం వంటి కార్యక్రమాలతో గ్రామంలో నవమి వేడుకలు జరిగినన్ని రోజులు సందడి వాతావరణం ఉంటుందన్నారు. అన్ని గ్రామాల్లో ప్రజలు శ్రీరామనవమి వేడుకలను కులమతాలకు అతీతంగా, పేదలు, ధనవంతులు అన్న భావన లేకుండా ఘనంగా జరుపుకుంటుండటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. రాములోరి ఉత్సవాల సందర్భంగా ప్రజల్లో ఐక్యత, ఆత్మీయత మరింత పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, సౌమిత్రి చంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



వీరబల్లి: విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న రాజంపేట ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి తదితరులు

విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆకేపాటి

వీరబల్లి : మండలంలోని తాటిగుంట పల్లి పంచాయతీలోని షికారుపాలెంలో ఇటీవల నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి బుధవారం పాల్గొనడం జరిగింది. ఎన్‌ఆర్‌ఐ కేకే రెడ్డి, మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, గుడి కాంట్రాక్టర్లు మన్నూరు గీతాంజలి, శుభోదరెడ్డి, తాటికుంటపల్లి సర్పంచ్ గోపీనాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, వాణిజ్య మండలి అధ్యక్షులు వెంకటరాజు, లాయర్ బాబు, స్థానిక వైస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం షికారుపాలెం ప్రజలు ఆకేపాటిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. వేద పండితుల వేద మంత్రాలతో అమ్మవారిని ప్రతిష్ఠించడం జరిగింది. తదుపరి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



రాజంపేట టౌన్: ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులు

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మలుగునాయక్, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ భద్రత విషయంలో 'కూటమి' ఘోర వైఫల్యం

రాయచోటి అర్బన్ : సత్యసాయి జిల్లాలో రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండల పర్యటనకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భద్రతను కల్పించడంలో రాష్ట్రంలో కూటమి సర్కార్ ఘోర వైఫల్యం చెందిందని వైఎస్‌ఆర్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ విమర్శించారు. బుధవారం వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్ వస్తున్నారంటే జనం పోటెత్తుతారనే విషయం తెలిసి కూడా పోలీసులు ఆ మేరకు గట్టి భద్రతా చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. వైఎస్ జగన్‌కు ఉన్న ప్రజాదరణ గురించి తెలిసి కూడా భద్రతా చర్యలు చేపట్టడంలో పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. జగన్ పర్యటించిన రామగిరి మండలం ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ ఖాకీ చొక్కా మాటున పసుపు చొక్కా ధరించి టీడీపీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారన్నారు. జగన్‌కు భద్రత కల్పన జరిగిన వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ ప్రయత్నిస్తుండడం సిగ్గుచేటన్నారు. జగన్‌ను విమర్శించడం ద్వారా తన స్థాయిని పెంచుకునేందుకు ప్రయత్నించడం మూర్ఖత్వమేనన్నారు. నీతి, నిజాయితీలకు అర్థమే తెలియని సుధాకర్ తాను నిజాయితీ పరుడినని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అయన నీతి, నిజాయితీల గురించి అనంతపురం, సత్యసాయి జిల్లాల ప్రజలందరికి బాగా తెలుసునంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు రక్షణ కల్పించడంలో జరిగిన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు పోలీసు యంత్రాంగం ఎస్‌ఐ సుధాకర్‌తో ఎదురుదాడి చేయిస్తుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా పోలీసులు తగురీతిలో స్పందించి జగనన్న పర్యటనలకు గట్టి భద్రతా ఏర్పాటు చేయాలంటూ కోరారు. సమావేశంలో వైఎస్‌ఆర్‌సీపీ బీసీ సెల్ నేతలు బుజ్జిబాబు, శివశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

12, 13న ఆసర్ల గంగమ్మ జాతర

గాలివీడు : మండల కేంద్రం పరిధిలోని బలిజపల్లి సరిహద్దు ప్రాంతంలో కుషావతి నదీ తీరన వెలసిన శ్రీ ఆసర్ల గంగమ్మ జాతర ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందులో భాగంగా గత రెండు రోజులుగా అమ్మవారని సోలెం తిప్పుతూ భక్తులకు దర్శనభాగ్యం కలిపిస్తున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ 12వ తేదీ శనివారం సిద్దలకూడు నైవేద్యంతో తిరునాల మహోత్సవానికి అంకురార్పణ చేసి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు అదే రోజు అర్ధరాత్రి విద్యుత్ దీపాల అలంకరణతో ముస్తాబు చేసిన చాందినీబండ్ల గ్రామోత్సవం, చెక్కభజనలు, కోలాటాలు, బాణసంచా డప్పు వాయిద్యాల మధ్య భక్తజన సందోహంతో నిండు తిరునాలగా మారుతుందన్నారు. 13వ తేదీ ఆదివారం ఉదయం మహిళలు బోనాల రూపంలో మొక్కులు చెల్లించుకోగా, చివరి అంకం అసాధుని కథతో తిరునాల మహోత్సవం ముగుస్తుందని తెలియజేశారు.

పీఎండీఎస్ పద్ధతితో దిగుబడులు

రామాపురం : ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ పద్ధతిలో పండుగ సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చునని మోడల్ మేకర్ సదాశివారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ కొత్తపల్లికి చెందిన రాఘవరెడ్డి రైతు ఎకరా పొలంలో జీవామృతం చేసి బీజామృతంలో విత్తన శుద్ధి చేసిన 30 రకాల విత్తనాలను చల్లడంతో 30 రోజులకే ఆకుకూరలు కోతకు వచ్చాయని, 40 రోజుల నుంచి 50 రోజులకు పూత దశకు వస్తోందని, పశువులకు మేతగా ఉపయోగించుకోవచ్చు, ఈ మేపును పశువులు తినడం వల్ల పశువుల కావాల్సిన అన్ని రకాల పోషకాలు లభిస్తాయని, దీంతో పశువులు పాలు ఎక్కువగా అందిస్తానని, పాలలో వెన్న శాతం పెరుగుతుందని, ఈ పాలు తాగడంతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటాయని, భూమిని కలయదున్నడంతో భూమికి కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. మొక్కలకు రోగనిరోధక శక్తి పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ కవిత, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు వెంకటామిరెడ్డి, సుధాకర్, శ్రీదేవి, రమణ, ప్రవళిక, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి, ఇంటి స్థలం కబ్జా

నందలూరు : రాజంపేట మండలం తొగురుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సాలిపేట గ్రామంలో భీము భాస్కర్ రెడ్డి అనే వ్యక్తి సుమారు ఆరు ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు దాదాపు ఏడు సెంట్లకు పైగా ఇంటి స్థలాన్ని ఆక్రమించి దర్జాగా ఇంటిని నిర్మించాడు. 2021వ సంవత్సరంలో అన్నమయ్య డ్యామ్ కొట్టుకొని పోవడంతో, దాని వల్ల వచ్చిన వరదల కారణంగా తొగురుపేట గ్రామ పంచాయతీ మొత్తం ముంపునకు గురైంది. వరదల కారణంగా పలు ఇల్లు చాలా మటుకు నేలమట్టమయ్యాయి. ఆ సమయంలో వరద బాధితులకు ప్రభుత్వం ఐదు సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందజేసింది. అందులో భాగంగా భీము భాస్కర్ రెడ్డికి ప్రభుత్వం 8వ నెంబర్ ప్లాట్‌ను కేటాయించడం జరిగింది. కానీ ఈ వ్యక్తి 9వ నెంబర్ ప్లాట్‌తోపాటు మరికొంత జాగాను ఆక్రమించి అందులో ఇంటిని నిర్మించుకున్నాడు. ఇదికాక 50 సంవత్సరాల క్రితం దోభీలకు సుమారు రెండున్నర ఎకరాలు మూడు కుటుంబాలకు ఇవ్వడం జరిగింది. ఆ భూమిని బలవంతంగా తీసుకోవడంతోపాటు బండిరేవుకు వెళ్లే దారిలోని మరికొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించాడు. సుమారు 14 పల్లెల గ్రామాల పశువులు, ప్రజలు ఈ దారిగుండా రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం భీము భాస్కర్ రెడ్డి బండిరేవుకు వెళ్లే దారిని మూసివేసి కబ్జా చేయడం జరిగింది. మొత్తం ఈ కబ్జాలపై గాడి శివారెడ్డి అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దారిని ఆక్రమించి కంచె వేసిన ఆక్రమణదారుడు

కార్యకర్తలకు అండగా నిలుద్దాం

రాజంపేట రూరల్ : జిల్లా స్థాయిలో నూతనంగా పార్టీ పదవులు పొందిన వారు కార్యకర్తలకు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో నూతనంగా నియమించిన కమిటీలో పదవులు పొందిన వారు మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు బుధవారం అధిక సంఖ్యలో విచ్చేశారు. తమకు ఎల్లవేళలా అండగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఆకేపాటిని సన్మానించి అభిమానం చాటుకున్నారు. ఎమ్మెల్యే ఆకేపాటిని సన్మానించిన వారిలో మున్సిపల్ కార్యదర్శిగా ఎన్నికైన గురు, నాయకులు సుబ్బాచారి, వెంకటేష్, ఖాదర్‌బాషా, ప్రసాద్, శివ, వెంకటేష్, రవి తదితరులు ఉన్నారు.

హక్కుల కోసం పోరాడుదాం

రాయచోటి అర్బన్ : యువజనుల హక్కుల కోసం పోరాడే సంస్థ ఏఐవైఎఫ్ అని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస ఐటీఐలో ఆయన సంఘం నేతలతో కలసి మహా సభల పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మే 15 నుంచి 18 వరకు తిరుపతి నగరంలో మొట్టమొదటగా ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్న మహాసభలకు దేశంలోని 29 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. 3 రోజుల పాటు జరిగే సభల్లో దేశంలో పేరుకుపోతున్న నిరుద్యోగం, అశాంతి, ప్రాంతీయ, మతతత్వ విధానం తదితర అంశాలపై చర్చించనట్టు చెప్పారు.

ఎస్జీటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి

రాయచోటి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా 120 సెకండరీ గ్రేడ్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా అప్‌గ్రేడ్ చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, గొనిగల హైమారావు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కె.విజయరామరాజుకు వినతి పత్రాన్ని సమర్పించారు. బుధవారం విజయవాడలోని కార్పొరేషన్‌లో ఆయనను కలసి ఈ వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009లోని రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలలో ఉన్న సెకండరీ గ్రేడ్ పోస్టులను అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి

సుండుపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఈఓ–2 రవీంద్రనాయక్ తెలిపారు. మండల పరిధిలోని పెద్ద మాదిగపల్లెలో బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదును పెంచడానికి గ్రామమంతా తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుణాత్మక విద్యను పెంపొందించడానికి ప్రభుత్వ పాఠశాలల్లోని అన్ని సౌకర్యాలను తల్లిదండ్రులతో చర్చించారు. చదువుతోనే నైపుణ్యం, జ్ఞానం కలుగుతుందని పిల్లల చదువులకు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఏ రకమైన ఫీజులు లేని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పిల్లల తల్లిదండ్రులందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మురళీధర్‌రాజు, శాంతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాలి

సిద్దవటం : కేటాయించిన స్థలాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో బుధవారం వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి కల్యాణోత్సవం సందర్భంగా 13 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. కడప – చెన్నై జాతీయ రహదారి ఉప్పరపల్లె పంచాయతీలోని సాయిబాబా గుడి సమీపంలో కారు, బస్సు, ద్విచక్ర తదితర వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు.

ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలి

సుండుపల్లె : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ సంస్థ ప్రతినిధి బివి రత్నం ఆధ్వర్యంలో బుధవారం పొదుపు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు వచ్చారు. ఈ సందర్భంగా బివి రత్నం మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత గురించి, రైతులకు పొదుపు ఎలా చేయాలో పొదుపు చేసినటువంటి డబ్బులను తమ అవసరాలకు ఎలా ఉపయోగించుకోవాలో ఆర్థికంగా ఎలా బలపడాలో తెలియజేశారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ నరసయ్య మాట్లాడుతూ సైబర్ నేరాల గురించి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మండలాధ్యక్షురాలు రాజమ్మ మాట్లాడుతూ ఆర్థిక అసమానతల గురించి పొదుపు గురించి రైతులకు ఈ విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.

ప్రారంభమైన జ్యోతి ఉత్సవాలు

చిన్నమండెం : మల్లూరు గ్రామంలో కొలువైన చౌడేశ్వరీ అమ్మవారి ఆలయంలో బుధవారం జ్యోతి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేక పూజలు, సాయంత్రం నుంచి జ్యోతులు తయారు చేశారు. అదే విధంగా అమ్మవారిని అలంకరించి సింహ వాహన ప్రభతో గంధ, సింధూర పుష్పాదులతో శోభాయమానంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తిమ్మారెడ్డి సేవలు మరవలేనివి

రాయచోటి టౌన్ : డిప్యూటీ తహసీల్దార్ వెంకటశివ తిమ్మారెడ్డి సేవలు మరువలేనివని డీఎస్ఓ రఘురామ్ అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని సుధా కల్యాణ మండపంలో లక్కిరెడ్డిపల్లి డిప్యూటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, గాలివీడు వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి, పలు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



డీటీని సన్మానిస్తున్న అధికారులు

రోడ్డు వేయాలంటూ ఎమ్మెల్యేకు మహిళల మొర

పెనగలూరు : మండలంలోని నల్లపురెడ్డిపల్లి పంచాయతీ ముండ్లవారిపల్లి దళితవాడకు వెళ్లే రోడ్డును వేసి ఆదుకోవాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు గ్రామ మహిళలు బుధవారం మొరపెట్టుకున్నారు. మండల సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యేను కలవడానికి గ్రామ దళితులంతా ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గుంతలమయమైన మా రోడ్డులో నడవలేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి మా గ్రామానికి ఆటోలు రావాలన్నా అధికంగా బాడుగలను అడుగుతున్నారని వారు తెలియజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గ్రామానికి రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, లేబాకు శ్రీనివాసులు రెడ్డి, భాస్కర్ రెడ్డిలతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



ముండ్లవారిపల్లి దళితవాడకు రోడ్డు వేయాలని ఎమ్మెల్యేలను కోరుతున్న గ్రామ దళిత మహిళలు

ప్రతి దళితవాడకు శ్మశానం ఏర్పాటు

పెనగలూరు : మండలంలోని ప్రతి ఎస్సీ, ఎస్టీ కాలనీలకు శ్మశానం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు సౌందర్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు శ్మశాన స్థలం ఏర్పాటు చేయడంతోపాటు ఆ స్మశానానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తామని తెలియజేశారు. అధికారులు, సర్పంచ్‌లు గ్రామాలలో స్మశానం లేని గ్రామాలను ఎంపిక చేసి వాటి వివరాలను తెలియజేయాలని వారు కోరారు. ఆర్.కమ్మపల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ముద్రపల్లి పంచాయతీకి చెయ్యేరు నుంచి తాగునీటిని ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివయ్య నాయుడు సభ దృష్టికి తెచ్చారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎప్పుడూ ముందుంటామని ఎమ్మెల్యే తెలియజేశారు. తాగునీటికి విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఒక్కొక్క శాఖ అధికారి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సభలో వివరించారు. అనంతరం ఎంఈఓ గిరి వరదయ్య మాట్లాడుతూ మండలంలో వచ్చే ఏడాది నుంచి ఐదు మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఎంపిక చేసి ఐదు మంది ఉపాధ్యాయులను నియమిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సౌందర్య, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, తహసీల్దార్ అమరేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పక్షపాతంతోనే టెండర్లు ఏకపక్షం

రాయచోటి అర్బన్ : మున్సిపల్ అధికారులు పక్షపాతంగా వ్యవహరించి గేటు వసూలు హక్కులను ఏకపక్షంగా కట్టబెట్టడం తగదని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్, వైఎస్‌ఆర్‌సీపీ నేత సుగవాసి శ్యామ్ కుమార్‌లు విమర్శించారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కూరగాయల మార్కెట్, టౌన్‌గేటు వసూలుకు మంగళవారం అధికారులు టెండర్లు నిర్వహించారన్నారు. గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ పాలకవర్గం రైతులకు, వ్యాపారులకు కొండంత అండగా నిలవడం జరిగిందన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో రైతులు, వ్యాపారుల కష్టాలు చూసి బస్టాండు గేటు, కూరగాయల మార్కెట్ గేటు వసూలుకు టెండర్ ప్రక్రియను రద్దుచేయడం జరిగిందన్నారు. నామినల్ పద్ధతిలో పురపాలక సంఘానికి డబ్బులు చెల్లించి ఎలాంటి గేటు వసూలు లేకుండా చేశామంటూ చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, వ్యాపారులపై ఎక్కడలేని భారాన్ని మోపుతోందన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక అన్నదాతలు అల్లాడుతుంటే ప్రభుత్వం వారి ముక్కుపిండి గేటు వసూలును చేపట్టడం దారుణమన్నారు. కూరగాయల మార్కెట్, టౌన్‌గేటు వసూలు కోసం మంగళవారం నిర్వహించిన టెండర్లలో మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి ఇతరులెవరూ ఓపెన్ టెండర్‌లో పాల్గొనకుండా పలు రకాలుగా ఒప్పందం పెట్టుకున్నారంటూ ఆరోపించారు. ఇద్దరు వేలంపాటదారులకు మాత్రమే వత్తాసుపలికి వారికే టెండర్‌ను కట్టబెట్టడం సమంజసం కాదన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా

తాగునీటి సమస్యను పరిష్కరించండి

సిద్దవటం : మండలంలోని సంటిగారిపల్లె గ్రామంలో రెండు వారాలుగా ఏర్పడిన తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంటిగారిపల్లె గ్రామంలోని ప్రజలు వేసవి కాలంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామానికి కూతవేటు దూరంలో పెన్నానది ఉన్నా తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. తాగునీటి కోసం మహిళలు రైతుల పొలాల్లోకి వెళ్లి పైప్‌లైన్‌లో కారుతున్న నీటిని బిందెలకు పట్టుకొని తెచ్చుకుంటన్నామన్నారు. గ్రామానికి తాగునీరు రావడంలేదని అధికారులకు తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదని, వేసవి కాలం కావడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని ఉన్నతాధికారులైనా మా సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



లీక్ అవుతున్న నీటిని బిందెలకు పట్టుకొని తెచ్చుకుంటున్న మహిళలు

ప్రతి హామీని అమలు చేసింది వైఎస్ జగనే

ఒంటిమిట్ట : మండలంలోని కొండమాచుపల్లి సర్పంచ్ మేరువ శివనారాయణ మండల వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మేరువ శివనారాయణ మాట్లాడుతూ మండల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులుగా ఎన్నిక చేసినందుకు, ఎన్నికకు సహకరించినటువంటి రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ మిథున్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు రఘునాథ రెడ్డి, మండల సీనియర్ నాయకులు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కొండమాచుపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కొండమాచుపల్లి పంచాయతీలో వాగ్దానం చేసిన ప్రకారం ప్రజలందరికీ ప్యూరిఫైడ్ వాటర్‌ను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. మేనిఫెస్టోని బైబిల్, ఖురాన్, భగవద్గీతలా భావించి ప్రతి మాటను, ప్రతి వాగ్దానాన్ని తూచా తప్పకుండా అమలు చేసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎప్పటికీ ప్రజల గుండెల్లో ఉంటారని తెలియజేశారు.

శతాధిక వృద్ధురాలికి సత్కారం

నందలూరు : లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కుర్రామణి యాదవ్ తల్లి కుర్రా వెంకటమ్మ శత వసంతాలు (100) పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్‌ఐ మన్నెం రామ్మోహన్ అధ్యక్షతన వాకర్స్ క్లబ్ ప్రెసిడెంటు మోడపోతుల రాము ఆధ్వర్యంలో అరవపల్లి కృష్ణ మందిరంలో పుర ప్రముఖుల మధ్య బుధవారం ఘనంగా సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు మన్నెం రామమోహన్ మాట్లాడుతూ పెద్దలు వెంకటమ్మ మనందరికీ మాతృ సమానురాలని, ఆ కాలం నుంచి జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలను చూసిన పెద్దరికం నిండిన ధన్యజీవులకు సదా వందనాలను తెలియజేస్తూ ఇప్పటికీ ఆరోగ్యపరంగా ఉండటానికి ప్రత్యేక కారణం కల్తీలేని స్వచ్ఛమైన ఆహారాన్ని తినడమే అన్నారు. ఈ కార్యక్రమంలో పోతురాజు మస్తానయ్య, బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు దాసరి నరసింహులు, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరమణ, ఉప్పుశెట్టి సుధీర్, న్యాయవాది గొబ్బిళ్ల సుబ్బరామయ్య, గంధం గంగాధర్, గురు ప్రసాద్, కొత్తపల్లి రాజాచారి, మట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.



వెంకటమ్మను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాగునీటి కేంద్రం ఏర్పాటు

నందలూరు : ప్రజలు, ప్రయాణికుల అవసర నిమిత్తం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండ్‌లోని బస్ సెల్టర్‌లో స్వచ్ఛమైన చల్లని తాగునీటిని ఏర్పాటు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) మస్తాన్ వలీ అన్నారు. బుధవారం నందలూరు బస్టాండ్‌లోని బస్సుసెల్టర్‌లో సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛమైన తాగునీటి కేంద్రాన్ని డీపీఓ ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.